సాక్షి
ఖమ్మం
సోమవారం । 30 । డిసెంబర్ । 2024



ముగిసిన రాష్ట్ర స్థాయి టోర్నీ

ఖమ్మంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ వాలీబాల్ బాల బాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. 8లో



పత్తి ధర లోటు పూడ్చేందుకు..

విత్తన పత్తి ధర లోటు చెల్లింపు పథకంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టగా, ఖమ్మం మార్కెట్ లోనూ అమలు చేసే అవకాశం ఉంది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. తెల్లవారుజామున, రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ జీపీఎఫ్, మెడికల్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల పెన్షనరీ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం పెద్ద మనసుతో పరిష్కరించాలని కోరారు. తాను ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు, చిత్తలూరి ప్రసాద్, విజయ అమృతకుమార్, ఆర్.బ్రహ్మారెడ్డి, కట్ట శేఖర్, డి.వెంకటేశ్వరరావు, రెబ్బా శ్రీనివాసరావు, పాపారావు పాల్గొన్నారు.

మరో ఇద్దరు రివర్షన్

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్లు)లు ఎస్ఏ(స్కూల్ అసిస్టెంట్) స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లుగా పదోన్నతి పొందిన ఏడుగురిలో ఇప్పటికే నలుగురిని రివర్షన్ చేయగా.. దరఖాస్తుల పరిశీలన అనంతరం తాజాగా మరో ఇద్దరిని రివర్షన్ చేశారు. ఈ మేరకు డీఈఓ సోమశేఖర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఖమ్మంగాంధీచౌక్: వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, కోశాధికారి తల్లాడ రమేష్ సంఘ కార్యకలాపాలపై రూపొందించిన నివేదికలను వినిపించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ఉపాధ్యక్షులు సోమ నరసింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, సెంట్రల్ ఈసీ సభ్యులు గొడవర్తి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే భూసారం

కామేపల్లి : సేంద్రియ ఎరువుల వినియోగంతోనే భూసారాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు(హైదరాబాద్) శ్యాంసుందర్ అన్నారు. పండితాపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి వస్తుందని, తద్వారా ఆర్థికంగా బలోపేతం కావచ్చని వివరించారు. అనంతరం సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పలువురు రైతులను సన్మానించారు. నూతన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మారుతి అగ్రోటెక్ అండ్ ఫెర్టిలైజర్స్ కంపెనీ చైర్మన్ సత్యనారాయణ, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, రాంబాబు, నాగబాబు, వీరభద్రం, లావణ్య, గోపి పాల్గొన్నారు.

కలలు తీర్చిన కలం !

- 'సాక్షి' కథనాలతో యంత్రాంగం, దాతల స్పందన
- ఆపన్నులకు అండగా నిలిచిన మహానుభావులు
- ఉమ్మడి జిల్లాలో వందలాదిగా సమస్యలకు పరిష్కారం
- ఎందరో బాధితులకు అండదండలు

- ఒక పేద విద్యార్థి ఎంబీబీఎస్ చదవాలన్న కల నెరవేరింది..
- ఒక ఆస్పత్రిలో వైద్యుల కొరత తీరింది..
- డయాలసిస్ సెంటర్లకు మందులు సమకూరాయి..
- ఓ ఊరికి బస్సు వచ్చింది..
- వరదలతో సర్వం కోల్పోయిన వారికి సాయం అందింది..
- ఓ ప్రభుత్వ శాఖలో అక్రమాలకు అడ్డుకట్ట పడింది..

రివైండ్ 2024

ఇలా చెబుతూ పోతే పరిష్కారమైన సమస్యలకు అంతే ఉండదు. సాయం అందుకున్న చేతులకు లెక్కే ఉండదు.. 'సాక్షి' కథనాలతో రంగంలోకి దిగిన యంత్రాంగం, దాతల చేయూతతో ఇవన్నీ సమకూరాయి. రేపటితో ప్రస్తుత సంవత్సరానికి ముగింపు పలకనున్న వేళ 'సాక్షి' చొరవతో పరిష్కారమైన సమస్యలు, చేయూతనందుకున్న వారిలో కొందరి కథనాలు మీ కోసం...

మిగతా 8లో..



శ్రీహర్షిత ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

నిరుపేద బాలిక... ఎంబీబీఎస్

వైరా: వైరా మున్సిపాలిటీలో 15వ వార్డుకు చెందిన కొనకంచి జోజి – ప్రకాశమ్మ దంపతుల కుమార్తె మృతి చెందింది. దీంతో ఆమె కుమార్తె పానెం శ్రీహర్షిత అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటూ చదువుకుంటోంది. నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించినా కనీస ఫీజు కట్టలేని దైన్యస్థితి ఎదుర్కొంటుండగా 'చదువుల తల్లిని కనికరించని లక్ష్మీదేవి' శీర్షికన అక్టోబర్ 3న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆమెకు అండగా నిలిచేందుకు దాతలు వెల్లువెత్తారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ తన స్నేహితులతో కలిసి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. వైరా ఎస్‌బీఐ మేనేజర్ వెంకటరెడ్డి బాలికకు పూచీకత్తు లేకుండా ఐదేళ్లు అవసరమైన రుణాన్ని అందజేస్తానని హామీపత్రం ఇచ్చారు. ఇలా బాలిక బ్యాంకు ఖాతాలో దాతలు రూ.4,38,432 జమ చేయగా, నేరుగా రూ.2,05,500 మేర శ్రీహర్షితకు నగదు అందింది. దీంతో ప్రస్తుతం ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆమె ఎంబీబీఎస్ చదువుతోంది. ఈ విషయమై శ్రీహర్షిత తాత కొనకంచి జోజి మాట్లాడుతూ 'సాక్షి' చలువతోనే తన మనవరాలు డాక్టర్ కోర్సు చదువుతోందని సంతోషంగా వెల్లడించాడు. సాక్షి పత్రిక కృషి మరువలేనిదని, యాజమాన్యానికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపాడు.



బాలికకు రుణ హామీ పత్రం అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ వెంకటరెడ్డి (ఫైల్)

సేవల్లో మేటి..108

- ఈ ఏడాది 47 వేల మందికి పైగా లబ్ధి
- అంబులెన్స్‌ల్లో 95 మంది మహిళల ప్రసవం
- 102 వాహనాల ద్వారా 94వేల మంది గర్భిణులకు ప్రయోజనం
- ఉమ్మడి జిల్లాలో 'అపర సంజీవని'లా నిలుస్తున్న వాహనాలు



కూసుమంచి సమీపంలో 108లో గర్భిణికి ప్రసవం చేసిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్

ఖమ్మంవైద్యవిభాగం: అత్యవసర వైద్య సేవల్లో 108 వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ప్రభుత్వ ఆస్పత్రులకు చేరవేయడంలో కీలకంగా నిలుస్తున్నాయి. దివంగత వైఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ వాహన సేవలు ప్రారంభం కాగా, ఒక్క ఫోన్ కాల్‌తో పావు గంట వ్యవధిలో ఘటనాస్థలికి చేరుకుంటున్న సిబ్బంది.. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుతున్నారు. క్షతగాత్రులు, గర్భిణులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఏ సమయంలో అయినా ఫోన్ చేస్తే చాలు వాలిపోయి ప్రాణదాతలుగా మారుతున్నారు. వైఎస్సార్ కంటే ముందు ఇలాంటి సేవలు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా ప్రాణాలు గాలిలో కలిసేవి. దీన్ని అర్థం చేసుకున్న వైఎస్ ప్రవేశపెట్టిన 108 వాహనాలు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సంజీవనిలా నిలుస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 21 వాహనాల ద్వారా విస్తృతంగా సేవలు అందిస్తున్నారు. అందులో రెండు తప్ప మిగతావన్నీ కొత్త వాహనాలే. సత్తుపల్లి, బనిగండ్లపాడు, మధిర, నేలకొండపల్లి, ఖమ్మం, రఘునాథపాలెం, ఖమ్మం ఎంసీహెచ్, బోనకల్, ఏన్కూర్, కల్లూరు, కామేపల్లి, కారేపల్లి, కూసుమంచి, ముదిగొండ, తల్లాడ, తిరుమలాయపాలెం, వైరా, ఖమ్మం మామిళ్లగూడెం, వేంసూరు, పెనుబల్లి, కొణిజర్ల, సింగరేణి సెంటర్లలో 108 వాహనాలు అందుబాటులో ఉంచారు. జిల్లా నలుమూలల నుండి ఎక్కడ నుంచి ఫోన్ వచ్చినా పావుగంటలో అక్కడికి చేరేలా అధికారులు ఆయా వాహనాలు ఏర్పాటు చేశారు. ఇక భద్రాద్రి జిల్లాలో 108 వాహనాలు 28 సేవలందిస్తున్నాయి.

47వేల మందికి పైగానే లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 108 వాహనాల ద్వారా 20,905 మంది అత్యవసర సేవలు పొందారు. అలాగే భద్రాద్రి జిల్లాలో 26,409 మందికి సేవలందాయి. ఈ వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డ్రైవర్ ఉంటారు. ఫోన్ రాగానే సత్వరమే ఘటనాస్థలికి చేరేలా వీటిని సంబంధిత పీహెచ్‌సీల వద్ద అందుబాటులో ఉంచుతారు. అంతేకాక కాల్ సెంటర్ నుంచి ఫోన్ రాగానే 15 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుని వైద్యం అందిస్తారు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో సుమారు 2,500 మంది ప్రాణాలు నిలిపారు.

వాహనాల్లో 95 మంది ప్రసవం..

108 వాహనాల ద్వారా ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రులకు చేరవేయడమే కాక గర్భిణులకు మేలు చేస్తున్నారు. పురిటినొప్పులు ఎక్కువైనప్పుడు కుటుంబ సభ్యులు 108 వాహనాలకు ఫోన్ చేస్తుంటారు. ఆ సమయాన చేరుకొని వారిని దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి చేర్పి ప్రసవం చేయిస్తున్నారు. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువైతే వాహనంలోనే డెలివరీ చేసి ప్రాణాలు నిలుపుతున్నారు. ఇలా ఈ ఏడాది ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో 32 మంది, భద్రాద్రి జిల్లాలో 63మంది గర్భిణులకు వాహనంలోనే ప్రసవం చేయగా.. ఆ తర్వాత సమీపంలోని ఆస్పత్రుల్లో చేర్పించారు.

102 ద్వారా 94 వేల మందికి..

102 వాహనాలు ప్రవేశపెట్టిన తర్వాత గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చాక ఆస్పత్రులకు వెళ్లి వచ్చేందుకు రవాణా ఇక్కట్లు తీరాయి. గర్భిణులను నెలనెలా పరీక్షల కోసం ఇంటి నుంచి ఆస్పత్రికి, ఆ తర్వాత మళ్లీ ఇంటికి చేరవేస్తున్నారు. గర్భం దాల్చిన మహిళల పేర్లు నమోదు చేసి సమయానుగుణంగా ఆశా, ఏఎన్ఎంలు 102 వాహనంలో తీసుకెళ్తారు. ఖమ్మం జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు వరకు 102 వాహనాలు 12,290 ట్రిప్పులు వేయగా 38,227 మంది గర్భిణులు సేవలు పొందారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో 21,994 ట్రిప్పులు వేయగా 56,095 మంది గర్భిణులకు సేవలందాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 11, భద్రాద్రి జిల్లాలో 19 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఖమ్మం నగరంలో వివిధ ప్రాంతాల్లో నాలుగు, సత్తుపల్లి, మధిర, కామేపల్లి, ఏన్కూర్, వైరా, కల్లూరు, నేలకొండపల్లి ఏరియాల్లో ఆయా వాహనాలను సమకూర్చగా, ప్రణాళికాయుతంగా గర్భిణులను ఆస్పత్రులకు చేర్చి వైద్యసేవలు అందిస్తున్నారు.

102 ద్వారా సేవలు పొందిన వారు		జిల్లాలో 108 వాహనాల ద్వారా ఈ ఏడాది అందిన సేవలు
లబ్ధిదారులు	నెల	లబ్ధిదారులు
3,050	జనవరి	1,453
3,814	ఫిబ్రవరి	1,477
3,572	మార్చి	1,649
3,094	ఏప్రిల్	1,626
3,482	మే	1,760
3,711	జూన్	1,639
3,444	జులై	1,815
3,127	ఆగస్టు	2,213
2,947	సెప్టెంబర్	1,943
2,824	అక్టోబర్	1,997
3,122	నవంబర్	1,820
2,030	డిసెంబర్ (ఇప్పటివరకు)	1,513

పకడ్బందీ ప్రణాళికతో సేవలు



పకడ్బందీగా ప్రణాళికాయుతంగా 108 వాహన సేవలు అందిస్తున్నాం. ఫోన్ చేసిన పావుగంట లోపే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్నీ కొత్త వాహనాలు కావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి సేవలు అందేలా చూస్తున్నాం. 102 వాహనాల ద్వారా గర్భిణులను సమయానికి ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నాం. అత్యవసర సమయంలో వాహనంలోనే డెలివరీ చేసేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ప్రమాద స్థితిలో ఉన్నవారి ప్రాణాలు నిలిపేందుకు మేము, సిబ్బంది నిరంతరాయంగా కృషిచేస్తున్నాం.

– భూమా నాగేందర్, 108, 102 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్

నేడు ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల



ఖమ్మం సహకారనగర్ : వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కార్యక్రమం ఈనెల 9తో ముగియగా.. దరఖాస్తుల పరిశీలన అనంతరం జిల్లా ఓటర్ల లెక్క తేల్చారు. కాగా జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్లు 3,955 మంది కాగా పురుషులు 2,300, మహిళలు 1,655 మంది ఉన్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 24 పోలింగ్ బూత్‌లు ఉండగా ఖమ్మం అర్బన్ మండలంలో నాలుగు, మిగతా మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన పూర్తి కాగా సోమవారం తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలిలా..

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
బోనకల్	16	17	33
చింతకాని	28	06	34
ఏన్కూర్	50	23	73
కామేపల్లి	63	20	83
కల్లూరు	62	30	92
ఖమ్మం రూరల్	308	176	484
ఖమ్మం అర్బన్	1009	895	1904
కొణిజర్ల	43	20	63
కూసుమంచి	37	26	63
మధిర	110	79	189
నేలకొండపల్లి	37	18	55
పెనుబల్లి	40	22	62
రఘునాథపాలెం	25	15	40
సత్తుపల్లి	166	109	275
సింగరేణి	92	76	168
తల్లాడ	23	12	35
తిరుమలాయపాలెం	23	11	34
వేంసూరు	48	15	63
వైరా	66	46	112
ఎర్రుపాలెం	32	26	58

పలువురికి పుడమిరత్న అవార్డులు



పురస్కారం అందుకుంటున్న ఐలయ్య

మధిర/ఖమ్మంరూరల్/ముదిగొండ : జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు ఆదివారం పుడమి రత్న జాతీయ విశిష్ట పురస్కారాలు అందుకున్నారు. పుడమి సాహితీ వేదిక తెలంగాణ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ముదిగొండలో జరిగిన కార్యక్రమంలో మధిర మండలం కృష్ణాపురం సాంఘిక సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయుడు రావిరాల బుచ్చయ్య, ఖమ్మంరూరల్ మండలం మంగళగూడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అమృతవర్షిణి జయరాజు, పి.ఐలయ్య సహా 60 మందికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు చిలుమల బాల్‌రెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షురాలు హేమావతి, పద్మశ్రీ వనజీవి రామయ్య, భక్త రామదాసు పదో తరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరళ్ల శ్రీనివాసరావు, పర్యావరణవేత్త కడవెండి వేణుగోపాల్, అన్నం శ్రీనివాసరావు, షేక్ జానీ పాషా, కత్తుల హరి పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల్లో ఖమ్మం హవా



ప్రథమ స్థానంలో నిలిచిన మహిళల ఫుట్‌బాల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో జిల్లా క్రీడా జట్లు హవా కొనసాగించాయి. వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. మహిళల ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలవగా, టేబుల్ టెన్నిస్‌లో బాలుర టీం చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. వెయిట్‌లిఫ్టింగ్‌లో కె.అభిరాం ప్రథమస్థానంలో నిలవగా, కె.ప్రేమ్‌కుమార్ రెండోస్థానం, వి.ఉదయ్, ఎస్.సాత్విక తృతీయ స్థానాల్లో గెలుపొందారు. ఉషూలో టి.భవ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది.

'ముక్కోటి'కి వేళాయె..

- భూలోక వైకుంఠమైన భద్రగిరిలో శరవేగంగా ఏర్పాట్లు
- రేపటి నుంచి ప్రయుక్త అధ్యయనోత్సవాలు
- తొమ్మిది అవతారాల్లో దర్శనం ఇవ్వనున్న రామచంద్రమూర్తి
- జనవరి 9న తెప్పోత్సవం, 10న ఉత్తర ద్వార దర్శనం



వైకుంఠ ద్వార దర్శన పూజల్లో భక్త జనం (ఇన్‌సెట్) మత్స్యావతారంలో స్వామి వారు (ఫైల్)

భద్రాచలం: భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీ వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తికావొస్తున్నాయి. దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాచలంలో ఈ ఉత్సవం ప్రత్యేకమైనది. ఈ నెల 31 నుంచి జనవరి 10 వరకు అధ్యయనోత్సవాలు, జనవరి 21 నుంచి నుంచి 23వరకు విలాసోత్సవాలు, జనవరి 26న స్వామి వారికి విశ్వరూప సేవ జరపనున్నారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 31 నుంచి జనవరి 9వరకు పగలు (పగల్ పత్తు), 10 నుంచి జనవరి 20వ తేదీ వరకు రాత్రి(రాపత్తు) ఉత్సవాలు జరుగుతాయి. ఈ నేపథ్యాన 31 నుంచి 10వ తేదీ వరకు నిత్యకల్యాణాలు నిలిపివేయనున్నారు.

అవతార రూపుడు

అధ్యయనోత్సవాల్లో భాగంగా జరిగే పగల్ పత్తు ఉత్సవాల్లో స్వామివారు తొమ్మిది అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. అలాగే, జనవరి 9న సాయంత్రం 4గంటలకు పవిత్ర గోదావరిలో స్వామికి తెప్పోత్సవం, 10న తెల్లవారుజామున ఉదయం 5 నుంచి 6గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. జనవరి 26న దేవతలందరినీ ఒకేచోట కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించే విశ్వరూప సేవ ఉంటుంది. ఈ సేవ కేవలం భద్రాద్రి రామయ్యకు మాత్రమే ప్రత్యేకం కావడం విశేషం.



గోదావరిలో తెప్పోత్సవం (ఫైల్)

రామయ్య అవతారాలు, విశిష్టత

ఈ నెల 31 నుంచి జనవరి 8వ తేదీ వరకు తొమ్మిదిరోజులపాటు స్వామివారం వివిధ రూపాల్లో భక్తలకు దర్శనమివ్వనున్నారు. తొలిరోజు శ్రీ మహావిష్ణువు మత్స్యావతారంలో దర్శనమివ్వనున్నారు. ఈ అవతారాన్ని పూజిస్తే కేతు గ్రహ బాధలు తొలగుతాయని ప్రతీతి. జనవరి 1న శ్రీహరి కూర్మావతారంలో దర్శనమివ్వనుండగా, ఈ అవతారంలో పూజిస్తే శని గ్రహ దోషాలు తొలగుతాయని పండితులు చెబుతున్నారు. 2న స్వామివారు వరాహావతారంలో దర్శనమివ్వనున్నారు. ఈ అవతారంలో స్వామివారిని దర్శిస్తే రాహు గ్రహ బాధల నుంచి విముక్తులవుతారని ప్రతీతి. 3న నరసింహావతారంలో దర్శనమివ్వనుండగా భూత గ్రహ బాధలు, కుజ గ్రహ బాధలు ఉన్నవారు ఈ అవతారాన్ని పూజిస్తే విముక్తి పొందుతారని విశ్వసిస్తారు. 4న పరశురామావతారంలో దర్శనమిస్తారు. శుక్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే శుభఫలితాలు పొందుతారని ప్రతీతి. 5న పరశురామావతారంలో దర్శనమివ్వనుండగా శుక్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే శుభఫలితాలు పొందుతారని నమ్ముతారు. 6న శ్రీరామావతారంలో దర్శనమివ్వనుండగా, సూర్యగ్రహ బాధలున్నవారు రామావతారాన్ని దర్శిస్తే బాధల నుంచి విముక్తి పొందుతారని పండితులు చెబుతున్నారు. 7న శ్రీబలరామావతారంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు. ఈ అవతారాన్ని దర్శించిన వారికి మాందిగుళికా గ్రహాల బాధలు తొలగిపోతాయి. 8న శ్రీకృష్ణావతారంలో దర్శనమివ్వనుండగా చంద్ర గ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే శుభఫలితాలు పొందుతారని ప్రతీతి.

కలలు తీర్చిన కలం!





▶▶ **ఖమ్మం మయూరిసెంటర్:** ఖమ్మంలో సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన వరదలతో మున్నేటిపై ప్రకాశ్‌నగర్ వద్ద బ్రిడ్జి స్పాన్లు కదిలాయి. ఈ విషయమై పాత వంతెన భేషుగ్గా ఉండడం, ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి దెబ్బతిన్న విషయమై 6వ తేదీన కథనం ఇవ్వడంతో వెంటనే అధికారులు బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు.

▶ మున్నేటి వరద ఇళ్లలోకి చేరడంతో సర్టిఫికెట్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, పుస్తకాలు కోల్పోయిన విద్యార్థుల ఇక్కట్లపై 'సర్టిఫికెట్లు మున్నేరు పాలు' సెప్టెంబర్ 4న, రాకాసి తండాను ఆకేరు వరద ముంచెత్తడంతో పంట పొలాల్లో రాళ్లు, ఇసుక మేటలు వేసిన విషయమై 'భూమి రాళ్లపాలు.. బతుకు రోడ్డుపాలు!' శీర్షికన 6వ తేదీన కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో వివిధ ప్రాంతాల దాతలు స్పందించి అటు విద్యార్థులు, ఇటు రైతులకు చేయూతనిచ్చారు.

▶ మున్నేటి వరద కారణంగా ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న తొమ్మిది మందిని రక్షించిన జేసీబీ డ్రైవర్ సుభాన్ ధైర్యసాహసాలపై 'పోతే ఒక్కడిని.. వస్తే పది మందిమి' శీర్షికన ఇచ్చిన కథనం అందరి మన్ననలు అందుకుంది.

▶▶ **ఎర్రుపాలెం:** మండల కేంద్రంలో అధ్వానంగా ఉన్న శ్మశానవాటికపై ఆగస్టు 13వ తేదీన 'ఇదీ శ్మశానవాటికేనా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి ఏలేశ్వరరావు అదే నెల 17న శ్మశానవాటికలోని ముళ్ల పొదలను తీయించారు. అంతేకాక తాగునీటి బోరు మరమ్మతులు చేయించగా స్థానికులు 'సాక్షి' చొరవను అభినందించారు.

▶▶ **సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అనస్తీషియన్‌ను బదిలీ చేయడంతో గర్భిణులకు ఆపరేషన్ అవసరమైతే ఖమ్మం రిఫర్ చేయాల్సి వచ్చేది. ఈ సమస్యపై ఆగస్టు 8వ తేదీన 'సాక్షి'లో 'ప్రసవ వేదన' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌గౌడ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ మేరకు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి నుంచి డాక్టర్ పృథ్వీని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ చేయగా గర్భిణుల ఇక్కట్లు తీరాయి.

▶▶ **దమ్మపేట:** ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతుల ఇక్కట్లు ఎదుర్కొంటున్న అంశానికి సంబంధించి డిసెంబరు 5న కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జీసీసీ, సివిల్ సప్లయీస్ అధికారులు అదేరోజు (5న) ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు.

▶ **దమ్మపేట:** దమ్మపేట మండలంలోని పామాయిల్ ఫ్యాక్టరీలో కార్మికుల భద్రతను పట్టించుకోవడం లేదని నవంబర్ 13న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయిల్‌ఫెడ్ మేనేజర్ అదే రోజు కార్మికులకు హెల్మెట్లు సమకూర్చారు. అంతేకాక 28వ తేదీ నుంచి భద్రత చర్యల్లో భాగంగా కార్మికులు, వాహనాల డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు ప్రారంభించారు.

▶▶ **ఇల్లెందు:** భద్రాద్రి జిల్లాలోని డయాలసిస్ సెంటర్లలో ఎరిథ్రోపోయిటిన్(ఈపీఓ) ఇంజక్షన్ అందుబాటులో లేక ఎదురవుతున్న ఇక్కట్లపై ఆగస్టు 28న 'సాక్షి'లో 'ఈపీఓ.. స్టాక్ నిల్' శీర్షికన కథనం వచ్చింది. దీంతో స్పందించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వెంటనే ప్రైవేట్‌గా కొనుగోలు కోసం రూ.5లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో రెండు నెలలకు సరిపడా స్టాక్ కొనుగోలు చేసి జిల్లాలోని అన్ని సెంటర్లకు చేరవేశారు. ఆ తర్వాత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి తీసుకెళ్లగా ప్రతీనెలా సరిపడా మందు సరఫరా చేస్తామని ప్రకటించారు.

▶▶ **అశ్వారావుపేటరూరల్:** నెలలుగా త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్ల కోసం పడిగాపులు కాస్తున్న అన్నదాతల తిప్పలను 'సాక్షి' కథనాలు తీర్చాయి. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కొత్తూరు, అనంతారం, గాండ్లగూడెం తదితర గ్రామాల్లో జూలై 18వ తేదీన వచ్చిన భారీ వర్షాలు, పెదవాగు వరద కారణంగా త్రీఫేస్ విద్యుత్ లైన్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు కొట్టుకుపోయాయి. రెండు నెలలు దాటినా సమస్యను విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో 'సాక్షి'లో సెప్టెంబర్ 28వ తేదీన 'త్రీఫేస్ తిప్పలు' శీర్షికన కథనం ప్రచురితం కాగా స్పందించిన అధికారులు పది రోజుల వ్యవధిలోనే దాదాపు 40 మంది రైతుల పొలాలకు త్రీఫేస్ కనెక్షన్లను పునరుద్ధరించారు.

▶▶ **అశ్వారావుపేటరూరల్:** అశ్వారావుపేట మండలం కుడుములపాడు సమీపాన దట్టమైన అటవీ ప్రాంతంలో పోడు పేరుతో కొందరు అక్రమంగా అడవి నరికివేసిన ఘటనపై జూన్ 10, 11 తేదీల్లో 'సాక్షి' కథనాలు ప్రచురించింది. ఈ కథనాలు అటవీ శాఖ ఉద్యోగుల్లో కలకలం సృష్టించాయి. అక్రమ పోడు బాగోతంపై ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. 'సాక్షి' కథనాలు వాస్తవమని తేలడంతో ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వగా ఆరుగురిపై కేసు నమోదు చేయడంతో పాటు అశ్వారావుపేట ఫారెస్టు రేంజర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్‌కు మెమోలు జారీ చేశారు.

▶▶ **కరకగూడెం:** గ్రామీణ రహదారుల దుస్థితిని తెలుపుతూ 'పల్లె రోడ్లు పట్టవా..? శీర్షికన మార్చి 7న కథనం రావడంతో స్పందించిన తహసీల్దార్ నాగప్రసాద్ అదే రోజు దెబ్బతిన్న పలు రోడ్లు మరమ్మతు చేయించారు.

▶ పల్లె ప్రకృతి వనాలపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ మార్చి 15న 'ఆహ్లాదం అటకెక్కినట్టే' శీర్షికన కథనం వచ్చింది. దీంతో అదే రోజు ఎంపీడీఓ పల్లె ప్రకృతి వనాలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుని నిర్వహణపై ఆదేశాలు ఇచ్చారు.

▶ 'శిథిలావస్థలో తహసీల్ భవనం' శీర్షికన మార్చి నెల 18న కథనం ప్రచురించగా తహసీల్దార్ నాగప్రసాద్ అదేరోజు మరమ్మతులు చేయించారు.

▶ గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచాయని ఫిబ్రవరి 2న 'గ్రామ పాలనపై నిర్లక్ష్యపు నీడ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ కుమార్ పనుల్లో వేగం పెరిగేలా ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.


'పేట'లో భూమాయ!

▶▶ **అశ్వారావుపేటరూరల్ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురుకుల పాఠశాలకు కేటాయించిన విలువైన భూముల ఫైల్ మాయం కావడంపై 'సాక్షి' లో జూన్ 21వ తేదీన 'పేటలో భూమాయ' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్థానికుడైన ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోగా భూముల ఫైల్ లేదని సమాధానం ఇచ్చారు. ఈ విషయమై కథనం రావడంతో మేల్కొన్న రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 1,228లోని 50 ఎకరాల భూమి ఆక్రమణలపై దృష్టి సారించారు. ఆపై ఇంటిలిజెన్స్ అధికారులూ విచారణ చేపట్టారు. అనంతరం కేయూ భూముల ఫైల్ మాయం కాలేదని, ఆక్రమణదారుల వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ వివరణ ఇచ్చారు.

▶▶ **మణుగూరు టౌన్:** మణుగూరు వంద పడకల ఆస్పత్రికి దాతలు ఇచ్చిన సామగ్రి మాయంపై 'ప్రభుత్వాస్పత్రిలో ఇంటి దొంగలు' శీర్షికన మే 16న వచ్చిన కథనంతో అధికారులు విచారణ చేపట్టారు.

▶ బిడ్డల ఆదరణ లేక చెట్టు కిందే ఉంటున్న వృద్ధురాలి దీనస్థితిపై 'చెట్టు కిందే వృద్ధురాలి జీవనం' నవంబర్ 15న శీర్షికన కథనం ప్రచురితం కాగా... అధికారులు స్పందించి వివరాలు ఆరా తీయగా, పలువురు దాతలు ఆమెకు అండగా నిలిచారు.

▶ మణుగూరు ఏరియాలోని సింగరేణి స్కూల్ విద్యార్థులు వెళ్లేందుకు బస్సు రద్దవడంతో 'బస్సు లేక విద్యార్థుల అవస్థలు' శీర్షికన ఏప్రిల్ 7న కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు మరుసటి రోజే బస్సును పునరుద్ధరించారు.

క్లుప్తంగా

మూడు రోజుల జైలు

ఖమ్మంక్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ఖమ్మం స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి మూడు రోజుల శిక్ష విధించారు. ఇటీవల మద్యం సేవిస్తూ తనిఖీల్లో పట్టుబడిన నగరానికి చెందిన ఆటోడ్రైవర్‌కు మూడురోజుల జైలు శిక్షతోపాటు మరికొందరికి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

చోరీల నిందితుడు అరెస్ట్

ఖమ్మంక్రైం: రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై జీఆర్పీ సీఐ అంజలి ఆధ్వర్యంలో ఎస్‌ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా ఖమ్మంరూరల్ మండలం ముత్తగూడెంనకు చెందిన నాగెల్లి వరకుమార్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా.. రైళ్లలో చోరీల విషయం బయటపడింది. అతడి వద్ద నుంచి ఐదు తులాల బంగారం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

రెండు కార్లు ఢీ..

- ఐదుగురికి గాయాలు

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై ఆదివారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పోర్లశ వీరన్న కోదాడకు చెందిన మాజీ కౌన్సిలర్ ఉప్పుగళ్ల శ్రీనివాసరావు కారులో పిఠాపురం ఆలయానికి వెళ్తున్నారు. జీళ్లచెరువు ఫ్లైఓవర్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతోపాటు వెనుక వస్తున్న మరో కారును ఢీకొట్టింది. దీంతో హెడ్ కానిస్టేబుల్, శ్రీనివాసరావు, అతడి భార్య సరోజకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక వస్తున్న కారులో హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వెళ్తున్న రిటైర్డ్ ఉద్యోగి కాట్రగడ్డ ఆనందకృష్ణ, అతడి కుమార్తె ప్రశాంతికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది వాహనాల్లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆనందకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ – 2 శ్రీధరాచారి తెలిపారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

ఖమ్మంక్రైం: నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆదివారం ఆగి ఉన్న కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆ కారు పక్క నే ఆగి ఉన్న ఇంకో లారీని ఢీకొట్టింది. ఈ ఘట న ఆదివారం చోటుచేసకుంది. ఈ ప్రమాదంలో కారు ముందు, వెనుక భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాలాజీనగర్‌కు చెందిన కారు యజమాని లక్ష్మినర్సింహారావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మట్టి ట్రాక్టర్లు పట్టివేత

కొణిజర్ల: ట్రాక్టర్లలో అక్రమంగా మట్టి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సూరజ్ కథనం ప్రకారం.. తణికెళ్ల ముక్తి హిల్స్ సమీపంలోని గుట్ట నుంచి ఆదివారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ట్రాక్టర్లలో మట్టి నింపుకుని కొణిజర్ల వైపు తరలిస్తుండగా ఎస్‌ఐ సూరజ్, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. మొత్తం ఏడు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మానవ జీవితం.. భగవత్ సాక్షాత్కారం


స్వామీజీలతో నిర్వహణ కమిటీ బాధ్యులు

- సేవ చేయడమే రామకృష్ణ సంఘ స్థాపన లక్ష్యం
- వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్ భవనం ప్రారంభం
- ముగిసిన తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం

సత్తుపల్లి: 'పదిహేను వందల ఏళ్ల ఆధ్యాత్మిక సంపదను ఇస్తున్నానని స్వామి వివేకానంద చెప్పారు.. రామకృష్ణ పరమహంస దృష్టిలో మానవుని జీవితం భగవత్ సాక్షాత్కారం.. భగవంతున్ని ప్రేమించాలంటే ఆయన నామస్మరణ చేయాలి.. నామం రుచి కలగాలంటే స్వయంగా భగవంతుడినే ప్రార్థించాలి..' అని రామకృష్ణ మఠం రాజమండ్రి బాధ్యులు స్వామి సేవ్యానందాజీ ఉపదేశించారు. సత్తుపల్లిలోని మాధురి ఫంక్షన్ హాల్‌లో శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన తెలుగు రాష్ట్రాల స్థాయి రెండు రోజుల 6వ భక్త సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాహిత్యాన్ని అధ్యయనం చేయటం ద్వారా తెలుసుకోవాలనే ఆరాటం ఉండాలని అన్నారు. రామకృష్ణ పరమహంస 20 గంటల పాటు విరామం లేకుండా భక్తుల సందేహాలను తీర్చేవారని చెప్పారు. పరమాత్మను తెలుసుకోవాలంటే యోగ్యత కావాలని, రామకృష్ణ సంఘం స్థాపన ముఖ్య ఉద్దేశం సేవ అని హైదరాబాద్ మఠానికి చెందిన యోగీశానందాజీ అన్నారు. రామ కృష్ణ నామ జపంతోనే జీవితం ధన్యమవుతుందని వివేకానంద చెప్పారని తెలిపారు. ఏ పని అయినా నిస్వార్థంగా చేస్తే భగవంతుని దర్శనమవుతుందని అన్నారు. రామకృష్ణ మఠం విజయవాడ బాధ్యులు వినిశ్చలానందాజీ మహరాజ్ మాట్లాడుతూ.. సహనం, పవిత్రత, త్యాగం, వినయశీలతతో కూడిన, శారదమాత, వివేకానందుల మూర్తిత్రయం బోధనలు నేటి భక్తులకు స్ఫూర్తి దాయకం కావాలని అన్నారు. ఐదువేల సంవత్సరాల భారతదేశ జాతీయ ఆధ్యాత్మిక జీవనాన్ని, రామకృష్ణ, వివేకానంద బోధనలను విస్తృత పరచాలని పిలుపునిచ్చారు. ఇంకా హైదరాబాద్ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద, స్వామికంటానంద, స్వామి సుకృతానంద మహరాజ్, స్వామి ఏగీసానంద మహరాజ్, పూజానందజీ మహరాజ్‌లు, ప్రవళిక త్యాగనిష్ఠాప్రాణ మాతాజీలు సందేశాలు ఇచ్చారు.

ఆధ్యాత్మికత పంచిన భక్త సమ్మేళనం..

రామకృష్ణ–వివేకానంద భావప్రచార పరిషత్ భక్త సమ్మేళనం సత్తుపల్లిలో రెండు రోజుల పాటు జరగగా భక్తులు ఆధ్యాత్మికత సందేశాలతో పులకించిపోయారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ బాధ్యులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆయా మఠాల వారు స్వామి వివేకానంద మెమెంటోలు ఇచ్చి అభినందించారు. రామచంద్రమిషన్, సత్యసేవా సమితి వలంటీర్లు భక్తులకు సేవలందించారు. స్వామి వివేకానంద విగ్రహం వద్ద నిర్మించిన వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్ భవనాన్ని స్వామిజీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, చల్లగుళ్ల అప్పారావు, నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, బయ్యపురెడ్డి, పులి శ్రీనివాసరావు, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, ఒగ్గు భగవాన్‌రెడ్డి, జీవి లింగారెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

పత్తి ధర లోటు పూడ్చేందుకు పీడీపీఎస్

- తెలంగాణలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహణకు చర్యలు
- ఖమ్మం మార్కెట్‌కు అవకాశం..!


సమావేశం నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విత్తన పత్తి కోసం ధర లోటు చెల్లింపు పథకం (పీడీపీఎస్) అమలుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం తేమశాతం ఆధారంగా పత్తికి గరిష్టంగా క్వింటాలుకు రూ.7,521గా ధర నిర్ణయించింది. ఈ ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రైతుల నుంచి కొనుగోలు చేసింది. అయితే జాతీయ, అంతర్జాతీయంగా పత్తికి ఉన్న డిమాండ్ ఆధారంగా వ్యాపారులు సగటున రూ.6,500కు మించి కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు వ్యాపారులకు విక్రయించిన పత్తికి కనీస మద్దతు ధర లభించలేదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం పీడీపీఎస్ (ప్రైస్ డిఫరెన్స్ పేమెంట్ స్కీం) అమలుకు నిర్ణయించింది. ఈ పథకాన్ని పత్తి పండించే రాష్ట్రాల్లో అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. తెలంగాణలో పత్తి సాగు ఉండటంతో ఈ రాష్ట్రంలో పీడీపీఎస్ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. అయితే రాష్ట్రంలో ఆదిలాబాద్, జగిత్యాల ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో ఈ ప్రాంతాల్లో పీడీపీఎస్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా మార్కెటింగ్ అధికారులు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌తో పాటు పలు మార్కెట్ కమిటీల అధికారులు పత్తి కొనుగోలుదారులు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో విక్రయానికి వచ్చే పత్తికి కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరను పీడీపీఎస్ పథకం విధానంలో చెల్లించి పంటను కొనుగోలు చేసే అంశంపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వీరాంజనేయులు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ వాలీబాల్ టోర్నీ

- బాలుర ప్రథమస్థానం వరంగల్ కైవసం
- రెండోస్థానంలో మహబూబ్‌నగర్
- బాలికల ప్రథమస్థానం నిజామాబాద్ జట్టు
- రెండోస్థానంలో మహబూబ్‌నగర్
- తృతీయ స్థానంలో ఖమ్మం బాలబాలికల జట్లు



తృతీయ స్థానం దక్కించుకున్న ఖమ్మం బాలుర జట్టు


తృతీయస్థానంలో నిలిచిన ఖమ్మం బాలికల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో భాగంగా నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన జూనియర్ బాలబాలికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో వరంగల్ జట్టు నిలవగా, ద్వితీయస్థానాన్ని మహబూబ్‌నగర్ జట్టు దక్కించుకుంది. తృతీయ స్థానంలో ఖమ్మం జట్టు నిలిచింది. బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు టైటిల్ దక్కించుకోగా, రెండో స్థానంలో మహబూబ్‌నగర్ జట్టు నిలిచింది. ఖమ్మం జట్టు తృతీయస్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయా స్థానాలు దక్కించుకున్న క్రీడాకారులకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు త్వరలో అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.క్రిష్టాఫర్‌బాబు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.గోవిందరెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, నరేష్, షఫీక్ అహ్మద్, టెక్నికల్ చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్‌రెడ్డి, వాలీబాల్ కోచ్ ఎండీ. అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కల్లూరురూరల్: మండలంలోని ముగ్గు వెంకటాపురం సమీపంలోని మహాలింగంకుంటకు కాపలాగా ఉన్న వ్యక్తి అందులోనే మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహాలింగంకుంట వద్ద కాపలాగా ఉండేందుకు అక్కుల వెంకటేశ్వర్లు శనివారం రాత్రి వెళ్లాడు. ఆదివారం ఉదయం మెరుగు గోపి కుంట వద్దకు వెళ్లి చూడగా చెరువు కట్టపై వెంకటేశ్వర్లు దుస్తులు ఉన్నాయి. చెరువులో థర్మకోల్‌తో చేసిన పడవ ఉండటంతో అనుమానం వచ్చి చెరువులో దిగి చూడగా చేపలు పట్టే వల వెంకటేశ్వర్లు కాళ్లకు చుట్టుకొని మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య అక్కుల లక్ష్మి ఫిర్యాదు మేరకు కల్లూరు ఎస్‌ఐ హారిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ...

మధిర: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి దెందుకూరు సమీపంలోని చెన్నం వారి చెరువు వద్ద చోటుచేసుకుంది. చెరువు సమీపంలో ఉన్న పత్తి చేనులో అటవీ జంతువుల వేట కోసం గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప తీగను అమర్చి దానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. చేపల చెరువులో వాటాదారుడైన శ్రీనివాసరావు శనివారం రాత్రి చేపల కోసం వల పెడుతున్నాడని తెలిసి అదే గ్రామానికి చెందిన చర్చి ఫాదర్ మీసాల శ్రీనివాసరావు (50) అక్కడకు వెళ్లాడు. అడవి పందుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగను చీకటిలో గమనించ కుండా తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సందర్భంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా పేలింది. మధిర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై కేసు నమోదు

కూసుమంచి: మహిళపై దాడిచేసి, గాయపర్చిన నలుగురిపై స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చేగొమ్మ గ్రామానికి ఆడెపు ఉమ భర్త కొన్నేళ్ల కిందట మృతిచెందాడు. దీంతో అదే గ్రామానికి చెందిన ఆడెపు రాజబాబు ఆమెను లైంగికంగా వేధిస్తున్నాడు. పలుమార్లు బాధితురాలు గ్రామపెద్దలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. శనివారం సాయంత్రం ఉమా ఇంటికి వచ్చిన రాజబాబు లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని గ్రామపెద్దలకు చెప్పగా ఆదివారం మాట్లాడుదామని చెప్పి పంపించారు. శనివారం అర్ధరాత్రి రాజాబాబు అదే గ్రామానికి చెందిన దాసరి రాంబాబు, అంబాల వీరబాబు, కైకొండాయిగూడెంనకు చెందిన కుమ్మరికుంట్ల సురేశ్‌తో వచ్చి తనపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడని, అడ్డు వచ్చిన తన అత్తమామలు శేషమ్మ, యలమంచి, బావ వెంకన్నను కూడా గాయపర్చాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ – 2 శ్రీధరాచారి తెలిపారు.

వ్యక్తిపై ...

జూలూరుపాడు: పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన ఓ వ్యక్తిపై ఆదివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రవి కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అదే సమయానికి ఓ వ్యక్తి తన ఆటోను గుండెపుడి వైపు నుంచి చంద్రుగొండ క్రాస్ రోడ్ వైపు అతివేగం, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వస్తున్నాడు. ఆటోను ఆపేందుకు హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, పోలీస్ సిబ్బంది ప్రయత్నించారు. గమనించిన డ్రైవర్ ఆటోను మరింత వేగంగా నడుపుకుంటూ వెళ్తుండగా వెంబడించి పట్టుకున్నారు. సదరు వ్యక్తి పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆటోడ్రైవర్ ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం భద్రుతండాకు చెందిన బాదావత్ కామేశ్‌ను అదుపులోకి తీసుకుని, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవి వివరించారు.

మోటార్ చోరీపై ...

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక గ్రామానికి చెందిన అమరం పరమయ్యకు చెందిన వ్యవసాయ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శనివారం సాయంత్రం వరకు బావి వద్ద మోటారు ఉండగా.. ఆదివారం మధ్యాహ్నం వెళ్లి చూడగా కనిపించలేదని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేశారు.